సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
18వ వసంతంలోకి...
ఎన్టీఆర్ - కృష్ణా
శుక్రవారం 27 డిసెంబర్ 2024
పేజీలు 8

పతాక స్వర్ణోత్సవాలకు

# సర్వం సిద్ధం



జిల్లా కలెక్టర్ బాలాజీ

వివరాలు 7లో

చివరి గింజా కొనే వరకు 2

## అప్రమత్తంగా ఉండాలి



బొండా ఉమా పేరుతో అనుచరుల

# అరాచకాలు

- బిల్డింగ్ కట్టాలంటే ఎమ్మెల్యే ట్యాక్స్ కట్టాలంటూ వేధింపులు
- కట్టకుంటే అన్న రమ్మంటున్నాడంటూ ఆఫీస్‌కు పిలుపు
- ఆఫీస్‌కి రాకుంటే బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లపై ఒత్తిళ్లు
- ఎమ్మెల్యే అనుచరుల తీరుతో ఖంగుతింటున్న భవన యజమానులు
- బిల్డింగ్ ఇన్ స్పెక్టర్ల పై ఒత్తిడి తెస్తున్న ఆ అనుచరులు

నిజామా..ఫేకా?





విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ : ఏం తమాషాగా ఉందా.. భవనం లో ఫ్లోర్ లు పైన ఫ్లోర్ లు వేస్తే అన్నకు చెప్పాల్సింది లేదా... అన్న రమ్మంటున్నారు వస్తావా లేదా బిల్డింగ్ ఇన్ స్పెక్టర్ ని పంపి పగులకొట్టించమంటావా...ఏంటి ఇదంతా ఎక్కడ అనుకుంటున్నారా మీరు విన్నది నిజమే విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం లో జరుగుతున్న తంతు. ఎమ్మెల్యే బొండా ఉమా అనుచరులమంటూ సందు సందులూ చైన్ మెన్ ల మాదిరి తిరుగుతూ బిల్డింగ్ యజమానులను బెదిరిస్తున్న తీరు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో బొండా ఉమా మహేశ్వరరావు అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. అయితే బొండా ఉమా మద్ధతు దారులు అంతేవిధంగా కష్టపడ్డారు. కాని గెలిచిన తర్వాత అనుచరుల ఆగడాలు మరింత శ్రుతిమించితున్నాయి. ప్రధానంగా భవనాలపై పడి మరీ కొత్త, పాత అన్న తేడాలేకుండా నిర్మాణం దశలో ఉన్న దేనికైనా కప్పం కట్టాల్సిందేనని హుకుం జారీ చేశారు. ఇంకేముంది సందు సందులా బొండా ఉమా

మిగతా 2లో

# ఉలిక్కిపడ్డ యంత్రాంగం

2లో

- ద్వాక్రా బజార్‌కు సిఫార్సు లేఖ ఇచ్చిన ఆ ఎంపీ ఎవరు?
- ద్వాక్రా బజార్‌లో ఎన్టీఆర్ జిల్లా అధికారులు ఎందుకు కనబడడం లేదు
- స్టాల్స్ డబ్బు ప్రభుత్వానికా...కమిటీ కా?
- సెర్ప్, డీఆర్‌డీ నిర్వహిస్తే డ్వాక్రా మహిళలకు ఉచితంగా స్టాల్స్ కేటాయించవచ్చు కదా!
- డ్వాక్రా బజార్‌లో ఫైర్ సేఫ్టీ ఎక్కడ?
- ప్రమాదం జరిగితే కాని కళ్లు తెరవరా..?
- డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ అనుమతి ఉందా?

ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న డ్వాక్రా బజార్ అక్రమాలు



(మొదటిపేజీ తరువాయి)

### బొండా ఉమా పేరుతో అనుచరుల

# అరాచకాలు

అనుచరులమంటూ పుట్టుకొచ్చి మరీ అన్న రమ్మంటున్నాడు అంటూ బేరాలు సాగిస్తున్నారు. బిల్డింగ్ కన్ స్ట్రక్షన్ అయిపోయిందన్న కూడా వదలడం లేదు. ఒక్కో ఫ్లోర్ కి ఒక్కో రేటు గజాల చొప్పున కడుతూ ఎమ్మెల్యే పేరుతో ట్యాక్స్ వేస్తున్నారు. దీంతో భవన యజమానులు లబోదిబోమంటున్నారు. సాధారణంగా బిల్డింగ్ ప్లాన్ ప్రకారం నిర్వహించాలన్న అనధికారికంగా నిర్మించాలన్న బిల్డింగ్ ఇన్స్పెక్టర్ల చేతిలోనే ఉంటుంది. కాని ఇప్పుడు సెంట్రల్ నియోజకవర్గం ఎమ్మెల్యే చేతిలోకి వెళ్లిపోయిందంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. ఎక్కడ బిల్డింగ్ నిర్మాణం చేపట్టినా బిల్డింగ్ ఇన్ స్పెక్టర్ల కన్నా బొండా ఉమా అనుచరులే వాలి పోయి మరీ సెటిల్ మెంట్ లు చేసేస్తున్నారు. మాట వినని వారి వివరాలను బిల్డింగ్ ఇన్స్పెక్టర్ ల కు పంపి మరీ ఒత్తిడి తీసుకొచ్చి పగులకొట్టేందుకు సైతం వెనుకాడడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరీ ముఖ్యంగా సెంట్రల్ నియోజకవర్గంలో అనుచరుల పేరుతో ఇంత జరుగుతున్న ఎమ్మెల్యే కి తెలియకుండా జరుగుతుందా అన్న అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ప్రధానంగా బిల్డింగ్ లు వేపించాలన్న కూల్చలన్నా ఎమ్మెల్యే పేషీ నుంచి వచ్చిన వాటికి మాత్రమే వెసులుబాటు కల్పిస్తూ మాట వినని వాటిని కూల్చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఏదిఏమైనప్పటికీ నియోజకవర్గంలో బొండా ఉమా పేరుతో పుట్టుకొస్తున్న అనుచరులు నిజమేనా.. ఆఫీస్ కు రమ్మంటుంటే అక్కడ ఎవరు డీల్ చేస్తున్నారు.. ఇదంతా బొండా ఉమా కు తెలిసేలా చేస్తున్నారా లేక దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలన్న సామెత మాదిరి అన్న ఎమ్మెల్యే గా ఉండగానే సంపాదించుకోవాలన్న ఆశ కలిగిందా... అయితే నియోజకవర్గం లో అనుచరుల పేరుతో జరుగుతున్న వాటిపై ఎమ్మెల్యే బొండా ఉమా అధికారులకు ఏవిధమైన ఆదేశాలిస్తారో వేచి చూడాల్సిందే.

## చెత్త కుప్పలో అప్పుడే పుట్టిన ఆడపిల్ల

**అలనా పాలనా చూడాల్సిన తల్లే ఈ ఘాతుకానికి పాల్పడిందా ?**

**కోరికలు తీర్చుకుని ఫలితాన్ని ఇలా వదిలేసిందా?**

**కనీసం ముక్కు పచ్చలారని ఆ పసి కందును చూసైనా ఆ కఠినాత్మురాలి మనసు కరగలేదా?**



**కంచికచర్ల డిసెంబర్ 26 మేజర్ న్యూస్ :** కంచికచర్ల శ్రీ రాజ్యలక్ష్మి గ్యాస్ కంపెనీ దగ్గర అప్పుడే పుట్టిన ఆడపిల్లను వదిలేసి వెళ్లిన వైనం గురువారం చోటు చేసుకుంది. దారిగా వెళుతున్న రైతు ఈ పసి కూనను చూసి తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వెంటనే ఈ విషయాన్ని ప్రాథమిక ఆరోగ్య సిబ్బందికి సమాచారం ఇవ్వటంతో ఆరోగ్య కేంద్రా నీకి పోలీసులు పసిపాపను తరలించడంతో డాక్టర్ మనోజ్ సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. చెత్త కుండీలు పాపను చీమలు పురుగులు చుట్టి ముట్టి ఉన్నాయి వీటన్నిటిని తొలగించి ప్రాథమిక చికిత్స అందించారు. సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి డాక్టర్ మనోజ్ సిబ్బంది తరలి వచ్చేసరికి ఆడపిల్ల ను చీమలు చెత్తకుండీలో పట్టి ఉన్నాయి. మెరుగైన చికిత్స కోసం వైద్యులు పాపను విజయవాడ ప్రభుత్వాసుపత్రి తరలించారు ఆడపిల్లను ప్రసవించిన తల్లి కొద్ది గంటల కిందటే చెత్త కుండీలో పడేసి వెళ్లిపోయినట్లుగా అనుమానిస్తున్నారు. కంచికచర్ల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఎమ్మెల్యే సహకారంతో సీసీ రోడ్ల నిర్మాణం



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సహకారంతో గ్రామంలో సీసీ రహదారులు నిర్మిస్తున్నట్లు పాగోలు ఎంపీటీసీ మేకా సత్యనారాయణ ప్రసాద్(బంగారుబాబు) తెలిపారు. గురువారం పాగోలు దళితవాడలో ఉపాధి హామీ పథకం నిధులు రూ. ఆరు లక్షలతో సీసీ రోడ్డును నిర్మించారు. నిర్మాణపు పనులను బంగారుబాబు ప్రారంభించి పనులను పర్యవేక్షించారు. కూటమి ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి బాట పట్టాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కనుమూరి వెంకటేశ్వరరావు, వార్డు సభ్యులు జంపాన మణి, స్థానికులు పాల్గొన్నారు.

# నేటి దినపత్రిక సూర్య కథనంపై ఉలిక్కిపడ్డ యంత్రాంగం

**ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న డ్వాక్రా బజార్ అక్రమాలు**

**స్టాల్స్ డబ్బు ప్రభుత్వానికా...కమిటీ కా?**

**డ్వాక్రా బజార్‌కు సిఫార్సు లేఖ ఇచ్చిన ఆ ఎంపీ ఎవరు?**

**డ్వాక్రా బజార్‌లో ఎన్టీఆర్ జిల్లా అధికారులు ఎందుకు కనబడడం లేదు**

**సెర్ప్, డీఆర్‌డీ నిర్వహిస్తే డ్వాక్రా మహిళలకు ఉచితంగా స్టాల్స్ కేటాయించవచ్చు కదా**

**డ్వాక్రా బజార్ లో ఫైర్ సేఫ్టీ ఎక్కడ?**

**ప్రమాదం జరిగితే కాని కళ్లు తెరవరా**

**డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్స్పెక్టర్ అనుమతి ఉందా?**



విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ : డ్వాక్రా బజార్ అక్రమాలపై సూర్య దినపత్రిక కథనంతో అధికారులు ఉలిక్కిపడ్డారు. అనుమతుల్లేకుండా స్వరాజ్య మైదానంలో ఓ కమిటీ డ్వాక్రా బజార్ నిర్వహిస్తుండడంతో వెలుగులోకి తెచ్చిన సూర్య దినపత్రిక కథనం ప్రస్తుతం సంచలనంగా మారింది. అంబేద్కర్ స్మృతివనం చుట్టూ అధికార యంత్రాంగం ఉన్న కన్నెత్తి కూడాచూడకపోవడం ఇప్పటికీ పలు అనుమానాలను రేకెత్తెస్తూనే ఉంది. డ్వాక్రా బజార్ 2019 లో స్వరాజ్యమైదానంలో నిర్వహించినప్పుడు డ్వాక్రా మహిళలకు కావాల్సిన వసతి, భోజన సదుపాయంతో పాటు ఉచితంగా స్టాళ్లను కేటాయించింది డిఆర్డిఎ. మహిళల ఉత్పత్తులను వారు ప్రదర్శించుకునే విధంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతిఒక్కరికి ఉచితంగా గతంలో చంద్రబాబు ప్రభుత్వ మే కల్పించింది. అయితే ప్రస్తుతం స్వరాజ్య మైదానంలో డ్వాక్రా బజార్ లో ఏం కావాలన్నా డబ్బుతోనే పని. స్టాళ్లు కావాలన్న, భోజనం తినాలన్నా, వసతి కావాలన్న డబ్బే... అప్పుడు డ్వాక్రా మహిళలకు చేసేదేంటి. వారికి కలిగే ప్రయోజనం ఏంటన్న సందేహాలు ప్రతిఒక్కరిలో నెలకొంటున్నాయి. ప్రధానంగా డ్వాక్రా బజార్ లో ప్రైవేట్ వ్యక్తులు నిర్వహించడం వలన తమ ఉత్పత్తులు ప్రదర్శించుకునే డ్వాక్రా మహిళలకు నష్టమే అంటున్నారు పలువురు. అయితే స్వరాజ్య మైదానంలో అభ్యుదయ డ్వాక్రా స్టేట్ కమిటీ చిన్న పాటి స్థలం ఆక్రమించుకొని తర్వాత అంచెలంచులుగా షెడ్డులు నిర్మించి స్టాళ్ళ సంఖ్యను పెంచి పెద్ద మొత్తంలో వసూలు చేస్తుందంతా ఎవరికి ఇస్తారు అంటే అటు ప్రభుత్వానికా, ఇటు ప్రైవేట్ వ్యక్తులకా.. ప్రైవేట్ వ్యక్తులు లబ్ధే పొందే క్రమంలో వారికి అనుమతులు తీసుకోవాలని అధికారులు ఎందుకు చెప్పడం లేదు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన డబ్బులతో పాటు అనుమతులు ఎందుకు తీసుకోవడం లేదన్న చర్చ జరుగుతుంది. ఇప్పటికీ డ్వాక్రా బజార్ లో ఫైర్ ఫెసిలిటీ లేదు. జరగకూడనిది జరిగితే తప్ప ఫైర్ అధికారులు కళ్ళు తెరవరా అని విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా అధికారుల ఉదాసీనత స్వరాజ్య మైదానంలో డ్వాక్రా బజార్ నిర్వహిస్తున్న కమిటీ కి వరంలా మారింది.

**సాధారణంగా పెద్ద మొత్తంలో..**

సమీకరణ జరిగిన ప్రాంతంలో ఖచ్చితంగా ఫైర్ నిబంధనలు పాటించాల్సిందే.. దానికి తగ్గట్టుగా ఫైర్ సేఫ్టీ అనుమతులతో పాటు ఫైర్ ఎక్విప్ మెంట్ ఉండాల్సిందే. కాని డ్వాక్రా బజార్ లో ఫైర్ అనుమతులు కాదు కదా ఫైర్ కిట్లు కూడా లేవు. స్పందించాల్సిన ఫైర్ డిపార్ట్మెంట్ ఇప్పటిదాకా కన్నెత్తి చూడకపోవడం కొసమెరుపు. ఏదిఏమైనా గతంలో డిఆర్డిఎ నిర్వహించినప్పుడు ఫైర్ నిబంధనలు పాటిస్తూ ఒక ఫైరింజన్ అక్కడ ఉండేలా జాగ్రత్తలు పాటించింది. కాని ప్రస్తుతం డ్వాక్రా బజార్ లో ఫైర్ సేఫ్టీ నిబంధనలు పూర్తిగా గాలికొదిలేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఏదిఏమైనప్పటికీ నడిరోడ్డుపై డ్వాక్రా బజార్ లో వివిధ డిపార్ట్మెంట్ లకు చెందిన ఏ ఒక్క అధికారి కానరాకపోవడం ఇప్పటికే చర్చ నీయాంశమే... ఇదే అలుసుగా మిగిలిన వారు స్వరాజ్య మైదానంలో పాగా వేయడం నిదర్శనంగా కనిపిస్తోంది.

# చివరి గింజా కొనే వరకు అప్రమత్తంగా ఉండాలి

**ఎంఏవోలు, గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులను చేయిపట్టి నడిపించాలి**

**ధాన్యం కొనుగోలుకు సంబంధించిన ప్రతి అంశంపైనా అవగాహన కల్పించాలి**

**నిర్లక్ష్యానికి తావులేకుండా సమన్వయ శాఖల అధికారులు పనిచేయాలి**

**సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 26, మేజర్ న్యూస్ : జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతు సేవా కేంద్రాల పరిధిలో ఇప్పటివరకు రూ. 178.39 కోట్ల విలువైన 77,440 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 11,730 మంది రైతుల నుంచి కొనుగోలు చేయడం జరిగిందని.. ప్రక్రియ సజావుగా సాగుతున్నా, ఇప్పుడు చివరి మైలులో చివరి గింజ కొనుగోలు వరకు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ.. ధాన్యం కొనుగోళ్లపై రెవెన్యూ పౌర సరఫరాలు, వ్యవసాయం, మార్కెటింగ్, సహకార తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం, రైతుల ఖాతాల్లో జమచేసిన సొమ్ము, గోనె సంచుల అందుబాటు, మిల్లులకు ధాన్యం రవాణా, వర్షాల నేపథ్యంలో తీసుకున్న ప్రత్యేక చర్యలు తదితరాలపై చర్చించారు. ఏ ఒక్క రైతుకూ ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇకపైనా తీసుకోవాల్సిన చర్యలపై మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు హితమే లక్ష్యంగా సమన్వయ శాఖల అధికారులు అత్యంత పారదర్రకంగా, జవాబుదారీతనంతో నిర్లక్ష్యానికి తావులేకుండా సేవలందించాలని స్పష్టం చేశారు. కోతలు చివరి దశలో ఉన్నందున ఆయా రైతులతో క్షేత్రస్థాయిలో మండల వ్యవసాయ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎప్పటికప్పుడు మాట్లాడుతూ అవసరమైన సహాయ సహకారాలు అందించాలన్నారు. పౌరసరఫరాల అధికారులు వివిధ శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ పనిచేయాలన్నారు. తేమ శాతం, మద్దతు ధర, గన్నీలు, రవాణా సౌకర్యం.. ఇలా ప్రతి అంశాన్ని క్షుణ్నంగా వివరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి ఐవీఆర్ఎస్ ద్వారా ఫీడ్‌బ్యాక్ తీసుకుంటోందని.. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సంతృప్తి విషయంలో జిల్లాను ముందు వరుసలో నిలిపేందుకు ప్రతి అధికారి, సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అందుబాటులో ఉన్న టార్పాలిన్ల సంఖ్యను పెంచాలని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

**పక్కదారి పడితే సహించేది లేదు**

ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్)కు సంబంధించి ఒక్క బియ్యపు గింజ పక్కదారి పట్టినా సహించేది లేదని, పేదల బియ్యం పక్కదారి పట్టకుండా క్షేత్రస్థాయి అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అక్రమాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కస్టమ్ మిల్లడ్ రైస్ (సీఎంఆర్) కలర్ పరీక్షలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని.. పరీక్ష ఫలితాలను డాక్యుమెంట్ చేయాలని ఆదేశించారు. తహశీల్దార్లు, పౌర సరఫరాల డిప్యూటీ తహశీల్దార్లు మిల్లులు, పీడీఎస్ దుకాణాలు, ఎండీయూ వాహనాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి, నివేదికలు సమర్పించాలన్నారు. అవకతవకలకు పాల్పడిన వారిపై కేసులు నమోదుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల ఆహార భద్రత కల్పించడంలో అత్యంత కీలకమైన పౌర సరఫరాల వ్యవస్థలో ఏ చిన్న అవకతవకలకు ఆస్కారం లేకుండా అధికారులు పటిష్ట సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ ఎం.శ్రీనివాసు, డీఎస్‌వో ఎ.పాపారావు, జిల్లా వ్యవసాయ టెక్నికల్ అధికారి ఎం.స్వప్న, జిల్లా కోఆపరేటివ్ అధికారి ఎస్.శ్రీనివాసరెడ్డి, మార్కెటింగ్ ఏడీ కె.మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# 2024 సంవత్సరానికి జీ తెలుగు ఘనమైన వీడ్కోలు..

## వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ సరిపోదా శనివారం, ఈ ఆదివారం సా.5:30 గం.లకు!




**అమరావతి, డిసెంబర్ 26, మేజర్ న్యూస్ :** వారం వారం సరికొత్త సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తున్న జీ తెలుగు ఈ ఆదివారం మరో బ్లాక్బస్టర్ మూవీతో వచ్చేస్తోంది. నేచురల్ స్టార్ నాని, ప్రియాంక మోహన్ నటించిన సరిపోదా శనివారం సినిమాతో 2024 సంవత్సరానికి ఘనమైన వీడ్కోలు పలికేందుకు సిద్ధమైంది. ఫ్యామిలీ అండ్ యాక్షన్ ఎంటర్టైనర్ సరిపోదా శనివారం డిసెంబర్ 29 ఆదివారం సాయంత్రం 5:30 గంటలకు జీ తెలుగులో మాత్రమే. తల్లికి ఇచ్చిన మాటకోసం సూర్య (నాని) తన కోపాన్ని వారంలో ఆరు రోజులు అదుపులో ఉంచుకొని శనివారం మాత్రం తనకు అన్యాయం చేసిన వారిపై పగ తీర్చుకుంటాడు. సోకులపాలెంలో జరిగిన ఒక విషాద ఘటన సిఐ దయా (ఎస్.జె.సూర్య పాత్ర)ని సూర్యకి పరిచయం చేస్తుంది. దయాని ఎదుర్కొనేందుకు సూర్యకి పోలీస్ కానిస్టేబుల్ చారులత (ప్రియాంక మోహన్) సహాయపడుతుంది. అసలు దయాపై సూర్య కోపానికి కారణమేంటి? రాజకీయ నాయకుడు కూర్మానందం (మురళీ శర్మ) ఎలా సమస్యల్లో పడతాడు? అసలు చారులత ఎవరు? అనే విషయాలు తెలుసుకోవాలంటే ఈ ఆదివారం జీ తెలుగులో ప్రసారమయ్యే సస్పెన్స్ యాక్షన్ డ్రామా సరిపోదా శనివారం సినిమా చూడాల్సిందే. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో డివివి దానయ్య నిర్మించిన ఈ సినిమాలో నాని, ప్రియాంక మోహన్ హీరో హీరోయిన్లుగా నటించగా ఎస్.జె.సూర్య, మురళీశర్మ, సాయికుమార్, శుభలేఖ సుధాకర్, శివాజీరాజా, అభిరామి, అదితి బాలన్, అజయ్ ఘోష్, విష్ణు ఓయ్, హర్ష వర్ధన్, అజయ్ తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. టాలీవుడ్ బ్లాక్ బస్టర్ మూవీ సరిపోదా శనివారం సినిమాతో జీ తెలుగుతో కలిసి ఈ ఏడాదిని మీరూ ఘనంగా ముగించేయండి!

# వంతెన కూలి కాలువలో పడిన ఇసుక ట్రాక్టర్





## వంతెన శిథిలావస్థకు చేరిందని ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్న పట్టించుకోలేదని గ్రామస్తుల ఆవేదన

## పెదపారుపూడి నుండి విజయవాడ వైపు వెళ్లే ప్రయాణికులకు రహదారి బంద్

**పామర్రు డిసెంబర్ 26 మేజర్ న్యూస్ :** పెదపారుపూడి మండలం ఈదులమద్దాలి గ్రామం వద్ద వంతెన కూలిపోవడంతో ఇసుక ట్రాక్టర్ ప్రమాదానికి గురైంది. వంతెన శిథిలావస్థకు చేరిన విషయాన్ని గ్రామస్తులు పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకువచ్చినా స్పందించలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఇసుక లోడుతో ట్రాక్టర్ వెళుతుండగా పూర్తిగా వంతెన కూలిపోయి రాకపోకలు నిలిచిపోయాయి. గుడివాడ నుండి కంకిపాడు మీదుగా విజయవాడ వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా శిథిలావస్థకుచేరడంతో పలువురు ఈ మార్గం గుండా ప్రయాణిస్తున్నారు. నిత్యం వందలాది వాహనాలు ఈ మార్గం ద్వారానే వెళుతున్నాయి.

ప్రస్తుతం ఈ వంతెన కూలిపోవడంతో గుడివాడ నుండి విజయవాడ వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఈ గ్రామానికి వెళ్లే మార్గం పూర్తిగా మూసుకుపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా మూడు రోజుల క్రితం ఈ నియోజకవర్గ పరిధిలోనికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాగా స్థానిక శాసనసభ్యుడు వర్ల కుమార్ రాజా ఈ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరిన విషయం విధితమే.

## కళ్ళజోళ్ళు పంపిణీకి దరఖాస్తు ఆహ్వానం డా. ఎస్.శర్మిష్ట



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రాష్ట్ర వైద్యారోగ్య శాఖ వారి ఆదేశానుసారం జిల్లా అంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో స్కూల్ హెల్త్ కార్యక్రమంలో భాగంగా పిల్లలకు కళ్ళజోళ్ళు పంపిణీ చేసేందుకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. ఎస్.శర్మిష్ట తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గల డిబిసిఎస్ ఆఫీసును లేదా krishna.ap.gov.in వెబ్ సైట్‌ను సందర్శించగలరని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్.శర్మిష్ట ఆ ప్రకటనలో తెలిపారు.

# 15వ రోజు మీ భూమి మీ హక్కు రెవిన్యూ సదస్సు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం మండలం, కరగ్రహారం పంచాయితీలో కృష్ణజిల్లా తెలుగు రైతు అధ్యక్షులు మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మెన్ గోపు సత్యనారాయణ,తహశీల్దార్ మధుసూధనరావు,మండల పార్టీ అధ్యక్షులు కుంచె దుర్గ ప్రసాద్, క్లస్టర్ ఇంచార్జి తలారి సోమశేఖర్,డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ అధ్యక్షతన 15వ రోజు మీ భూమి మీ హక్కు రెవిన్యూ సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సదస్సులో భూమి కొనుగోలు,దాన విక్రయము, భాగ పంపిణీలు ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని రెవెన్యూ రికార్డులలో పేరు నమోదు చేసుకొనుట కొరకు,పట్టాదారుడు మరణించిన ఎడల వారి వారసులు రెవెన్యూ రికార్డుల్లో పేరు నమోదు చేసుకొనుట కొరకు, వారసత్వపు ఆస్తిని భాగ పరిష్కారము ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని రెవిన్యూ రికార్డుల్లో పేరు నమోదు చేసుకొనుట కొరకు,రెవిన్యూ రికార్డులలో పట్టాదారు పేరు తప్పులు ఉన్న ఎడల సరి చేసుకొనుటకు, పట్టా భూములు సెక్షన్ 22ఏ నిషేధిత భూముల జాబితాలో ఉన్నచో వాటిని తొలగించుట కొరకు,సర్వే నెంబరు, సబ్ డివిజన్లో తప్పులు ఉన్నచో వాటి సవరణ కొరకు, పట్టా భూములు ఇనాం భూమిగా నమోదు అయినచో సవరణ కొరకు,జాయింట్ ఎల్ పీ యం విభజన, విస్తీర్ణములో వ్యత్యాసము ఉన్న ఎడల సవరణ కొరకు,గ్రామంలోని ప్రభుత్వ భూముల ఆక్రమణలు తొలగించుట కొరకు,నీటి తీరువా డిమాండు సరిచేసుకొనుటకు, చెల్లించుటకు, రెవెన్యూ శాఖకు సంబంధించి జీఎస్‌డబ్ల్యూఎస్‌లో గల 100 రకాల పౌర సేవలను ఉచితంగా వినియోగించుకొనుట మొదలగు సమస్యలు పరిష్కరించబడుతాయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ రాజాబాబు,రెవిన్యూ ఇన్స్పెక్టర్ రాజశేఖర్,బత్తిన నాగరాజు, నాగుల మీరా,పరసా వడ్డికాసులు, తోట భాస్కరరావు, రెవిన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ నివేదిక వెల్లడి

**విజయవాడ మేజర్ న్యూస్ :** అగ్రగామి ఆన్ డిమాండ్ కన్వీనియన్స్ ప్లాట్ ఫారమ్ స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ వార్షిక నివేదికను వెల్లడించింది. ఈ సందర్భంగా స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ హెడ్ అమితేష్ ఝా మాట్లాడుతూ హౌ ఇండియా స్విగ్గీ -2024 పేరుతో సేకరించిన పలు అంశాల గురించి వివరించారు. విజయవాడ నగరంలో వినియోగదారుల అవసరాలు కేవలం పది పదిహేను నిమిషాలు తక్కువ వ్యవధిలో తీర్చడానికి స్విగ్గి ఇన్‌స్టామార్ట్ ఉపయోగం అవుతుందన్నారు. డిసెంబర్ 2022లో ప్రారంభించినప్పటి నుండి, రోజువారీ నిత్యావసర వస్తువులు, బొమ్మలు, అందం, మేకప్, పండుగల వంటి ప్రతిదానితో విజయవాడ త్వరిత వాణిజ్య సౌలభ్యం వైపు ఎక్కువగా మారడాన్ని తాము చూశామన్నారు. అవసరమైన వస్తువులు కేవలం 10 నిమిషాల్లో పంపిణీ చేయబడతాయని, నగరం నుండి అత్యధిక కొనుగోళ్లలో పాలు, టొమాటో, పెరుగు, పచ్చిమిర్చి సన్‌ఫ్లవర్ ఆయిల్ ఉన్నాయన్నారు. ఒక నగర వినియోగదారు 10 నిమిషాలలో కిరాణా సామాగ్రి, ఎలక్ట్రానిక్స్ వారికి అవసరమైన ప్రతిదానిపై ఖర్చు చేస్తున్నారని, ఈ ప్రయాణంలో భాగమైనందుకు తాము గర్విస్తున్నామన్నారు. విజయవాడ నగరం ద్వారా అత్యధికంగా ఆర్డర్ చేయబడిన వస్తువులు పాలు, టమోటాలు, పెరుగు, పచ్చిమిర్చి (పచ్చి మిర్చి), సన్‌ఫ్లవర్ ఆయిల్. రోజువారీ స్టేపుల్స్ నిలిచాయన్నారు. తాజా బ్రెడ్ నుండి గుడ్ల వరకు, నగరం యొక్క గో టు ఆర్డర్లు డైరీ స్టేపుల్స్ కోసం ఉన్నాయని, సౌలభ్యం వంటగదితో మొదలవుతుందని రుజువు చేస్తుందన్నారు. చిప్స్‌తో సుగమం చేసిన స్నాక్ ట్రయిల్‌ల నుండి త్వరితగతిన పండుగల వరకు, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ విజయవాడ యొక్క రిథమ్‌ను సజీవంగా ఉంచిందని, ప్రతి ముఖ్యమైన, ప్రతి వేడుక ప్రతి వస్తువు వేగం శైలితో అందిస్తుందని చెప్పారు.

## ఘర్షణలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



**పామర్రు డిసెంబర్ 26 మేజర్ న్యూస్ :** ఇద్దరు వ్యక్తుల నడుమ 300 రూపాయల విషయంపై జరిగిన ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన పామర్రు మండలం చాట్లవానిపురంలో చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి పామర్రు సీఐ వి.శుభాకర్ అందించిన వివరాల ప్రకారం చాట్లవానిపురం గ్రామానికి చెందిన చాట్ల సతీష్ అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావుకు మూడు వందల రూపాయలు అప్పుగా ఇచ్చాడు. తన బాకీ తీర్చమని వెంకటేశ్వరావును నిలదీయడంతో అతడు కర్రతో గట్టిగా సతీష్ తలపై కొట్టాడు. ఈనెల 20వ తేదీన ఈ సంఘటన జరుగగా గాయపడిన సతీష్ ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సతీష్ బుధవారం రాత్రి మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ శుభాకర్ తెలిపారు. కాగా నిందితుడైన వెంకటేశ్వరరావు పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలింపు చర్యలు చేపట్టామని సిఐ చెప్పారు.

# కృష్ణా జిల్లాకు మణిహారంగా మచిలీపట్నం పోర్టు

### బందరు పోర్టు ద్వారా లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు..దేవరపల్లి సురేష్



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నంలో నిర్మిస్తున్న నౌకాశ్రయం కృష్ణాజిల్లాకు మణిహారంగా ఉంటుందని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ బాబు తెలిపారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో పోర్టు నిర్మాణ ప్రాంతాన్ని గురువారం సురేష్ బాబు సందర్శించి జరుగుతున్న పనుల గురించి సైట్ ఇంజనీర్ ఆనగాని ప్రదీప్ ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ పోర్టు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతుండటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ను ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు అనుసంధానించడానికి ఓడరేవు చాలా ఉపయోగపడుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ లో వాణిజ్యాన్ని పెంచి పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఉందన్నారు. పోర్టు నిర్మాణం ద్వారా లక్షలాది మందికి ప్రత్యక్షంగా,పరోక్షంగా ఉపాధి అవకాశాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మచిలీపట్నం వర్తక,వాణిజ్య పారిశ్రామిక అభివృద్ధికి చిరునామాగా మారుతుందన్నారు. పోర్టు నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులు స్ఫూర్తి దాయకులని సురేష్ బాబు కొనియాడారు.

# వాడవాడలా వంగవీటి మోహనరంగాకు ఘననివాళి



### దివిసీమలో వంగవీటి మోహన రంగా 36వ వర్ధంతి

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** బెజవాడ నడిబొడ్డున కుల మతాలకు అతీతంగా పేద, బలహీన వర్గాలకు అండగా నిలుస్తూ, అనాధలకు ఆపన్న హస్తం అందించిన ఏకైక నాయకుడు టైగర్ వంగవీటి మోహన రంగా అని పలువురు వక్తలు ఆనాటి రోజులను మననం చేసుకున్నారు. అవనిగడ్డ ప్రధాన సెంటర్లో రంగా కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని రంగా వారసుడుగా ఉన్న వంగవీటి రాధాకృష్ణకు కూటమి పార్టీలో సముచిత స్థానం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. గురువారం వంగవీటి మోహన రంగా 36వ వర్ధంతి కార్యక్రమాన్ని రంగా అభిమానులతో పాటు వివిధ పార్టీలు వాడ వాడల జరుపుకున్నారు. తెలుగు దేశం మండల పార్టీ అధ్యక్షులు, రాధా-రంగా మిత్ర మండలి నాయకులు యాసం చిట్టిబాబు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో గల వంగవీటి మోహనరంగా దామెర్ల చిన్న నరసింహా రావుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. గురువారం బెజవాడ బొబ్బిలి పేదల పాలిట పెన్నిధి బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి వి ఎం రంగా 36వ వర్ధంతిని పురస్కరించుకొని నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ చిలకలపూడి పాపారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు 40 సంవత్సరాల పాటు బతికి ఉన్న వంగవీటి మోహన రంగా పేదల కోసం పరితపించిన వ్యక్తి అని పేదల నివేశన స్థలాల పట్టాల కోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తూ పేదల కోసమే మరణించిన మహోన్నత వ్యక్తి వంగవీటి మోహన్ రంగ అని ఆయన మర ణించి 36 సంవత్సరాలు కావస్తున్న పేదల హృదయాలలో దేవుడిలా కొలువై ఉన్నాడని అన్నారు. జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్వ రరావు జనసేన జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు మాట్లాడుతూ ఏడు సంవత్సరాలు రాజకీయ నాయకుడిగా ఉన్న వంగవీటి మోహనరంగా పేదలకు ఎన్నో సేవలు అందించారని ఆయన సేవలను కొనియాడారు. చివరిగా చిట్టిబాబుర్తు మాట్లాడుతూ రంగా తో తనకున్న అనుబంధాలను మననం చేసుకుంటూ రాధా రంగా మిత్రమండలి వ్యవస్థాపకులు రాజనాల మాణిక్యాలరావు, దివంగత పెద్ద కృష్ణ తో కలిసి వంగవీటి మోహనరంగా కార్యక్రమాల్లో పాల్గొన్న సంఘటనలో గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల పార్టీ అధ్యక్షులు గుడివాక శేషుబాబు, రాజనాల వీరబాబు, డిసి వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్ బాబు, అశ్వరావు పాలెం సర్పంచ్ పాండ్రాజు లంకమ్మ ప్రసాద్, జనసేన వీర మహిళ బచ్చు కృష్ణకుమారి, అవనిగడ్డ పట్టణ టిడిపి పార్టీ అధ్యక్షులు అన్నపురెడ్డి లక్ష్మీనారాయణ, కూటమి నేతలు గుడివాడ శివరావు, దాసి దేవదర్శనం, మత్తి శ్రీనివాసరావు, అవనిగడ్డ ప్రకాశం, అన్నపురెడ్డి రామదాసు, బడే సుబ్బారావు, విశ్వనాధుని మురళి, యలవర్తి చిన్న, కురాకు ప్రసాదు, అడపా రాంబాబు, గంగిశెట్టి రాజేంద్రప్రసాద్, చందన నరసింహారావు, నియోజకవర్గంలోని రాధా రంగ మిత్రమండలి అభిమానులు భారీగా పాల్గొని రంగ విగ్రహానికి నివాళులు అర్పించారు.



### కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ...

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వంగవీటి మోహనరంగా 36వ వర్ధంతి సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ అందే శ్రీరామ్ మూర్తి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొత్తపేటలో రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు నరహరిశెట్టి శ్రీమన్నారాయణ, కోడూరు మండల పార్టీ అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటేశ్వరరావు, అవనిగడ్డ పట్టణ పార్టీ అధ్యక్షులు ఆకుల మణికంఠ,ముస్లిం మైనార్టీ నాయకులు గౌస్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

### రంగా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే. సింహాద్రి




బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి పోరాటయోధుడు వంగవీటి మోహన రంగా 36వ వర్ధంతిని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం వంగవీటి మోహనరంగా 36వ వర్ధంతిని పురస్కరించుకొని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో రంగా చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, రాధా రంగా మిత్రమండలి దివి యూనిట్ అధ్యక్షులు రాజనాల మాణిక్యాలరావులు రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి గాజుల జై గోపాల్, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాష,మండల యూత్ కన్వీనర్ చింతలపూడి బాలుల తోపాటు పలువురు పార్టీ నాయకులు రాధా రంగా మిత్రమండలి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రంగా వర్ధంతి



బడుగు బలహీన వర్గాల నాయకుడు వంగవీటి మోహనరంగా అని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక గాంధీక్షేత్రంలో మాజీ ఎమ్మెల్యే దివంగత వంగవీటి మోహనరంగా వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు రంగా చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్, ఎంపీటీసీ బొప్పన భాను, నీటి సంఘం అధ్యక్షులు దాసినేని శ్రీనివాసరావు, డీసీ మాజీ ఉపాధ్యక్షులు కాగిత రామారావు, టీడీపీ నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు ఘంటసాల రాజమోహనరావు (కన్నయ్య), కూటమి నాయకులు మేడికొండ విజయ్, చందన నరసింహారావు, గుడివాక నరహరి, పులిగడ్డ నాంచారయ్య (పసి), బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

### వంగవీటి మోహన్ రంగాకి నివాళులర్పించిన గోపు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** గురువారం కృష్ణజిల్లా తెలుగు రైతు అధ్యక్షులు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపు సత్య నారాయణ కానూరు గ్రామంలో వంగవీటి మోహన్ రంగా 36 వ వర్ధంతి సందర్భంగా వారి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆనంతరం అయన మాట్లాడుతు రంగ చేసిన సేవలను సమాజం కోసం ఉద్వేగభరితమైన న్యాయం కోసం,అన్ని సామాజికవర్గాల ఆకాంక్షలు, పోరాటాలకు గాత్రదానం చేసిన ఆయన త్యాగాలు సామూహిక స్మృతిలో నిలిచిపోయాయి అని అన్నారు. అందరూ వారి బాటలో నడవాలని గుర్తు చేసారు. ఈ కార్యక్రమంలో దివి మహేష్,పుప్పాల కొండా, జొన్నల నాగమల్లేశ్వర రావు,సిద్దిరెడ్డి పాండురంగారావు, గణపబత్తుల పాము,సిద్దిరెడ్డి కొండా మొదలగు వారు పాల్గొన్నారు.

### పామర్రు నియోజకవర్గం పరిధిలో...



**పామర్రు మేజర్ న్యూస్:** స్వర్గీయ వంగవీటి మోహన్ రంగ 36వ వర్ధంతి వేడుకలను పామర్రు నియోజకవర్గం పరిధిలోని వివిధ గ్రామాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ కేంద్రమైన పామర్రు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ తాడిశెట్టి నరేష్ రంగా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన



పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, రంగా అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే పామర్రు మండల పరిధిలోని కొండిపర్రు గ్రామంలో కూడా రంగా అభిమానులు ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. పమిడిముక్కలలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మహేష్ రంగా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

### పేటలో ఘనంగా రంగా వర్ధంతి



**జగ్గయ్యపేట, మేజర్ న్యూస్ :** నియోజకవర్గ జనసేన పార్టీ ఆధ్వర్యంలో వంగవీటి మోహన రంగా 36వ వర్ధంతి సందర్భంగా జగ్గయ్యపేట పట్టణం, కోదాడ రోడ్డులో రంగా విగ్రహం వద్దకు భారీ ర్యాలీతో వెళ్ళి పూలమాలలతో ఎన్టీఆర్ జిల్లా జనసేన అధ్యక్షులు సామినేని ఉదయ భాను ఘనంగా నివాళులు అర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర రావు, కౌన్సిలర్ కొలగాని రాము, జనసేన నాయకులు ఆవాల భవానీ ప్రసాద్, మాజీ ఎంపిపి మాతంగి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వంగవీటి రంగా ఎప్పటికీ ప్రజల గుండెల్లో ఉంటారని, మూడు ఏళ్లు శాసనసభ్యునిగా పనిచేసిన 36 ఏళ్ల వరకు ప్రజల గుండెల్లో ఉన్నారని ఎప్పటికీ ఉంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

### తెలుగుదేశం పార్టీ కాపు నాయకుల ఆధ్వర్యంలో ..



స్వర్గీయ వంగవీటి మోహన రంగా 36వ వర్ధంతి సందర్భంగా జగ్గయ్యపేట పట్టణంలో తెలుగుదేశం పార్టీ కాపు నాయకుల ఆధ్వర్యంలో కోదాడ రోడ్డులో గల వంగవీటి మోహన రంగా విగ్రహానికి జగ్గయ్యపేట నియోజకవర్గం సమన్వయ కమిటీ సభ్యులు శ్రీరాం చిన్నబాబు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కాపు నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



### తెలుగు జాతి గర్వించే నేత వంగవీటి మోహన రంగా.....

**నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు**

పట్టణంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్వర్గీయ వంగవీటి మోహన రంగా 36వ వర్ధంతి సందర్భంగా కోదాడ రోడ్ ఉన్న వంగవీటి మోహన్ రంగా విగ్రహానికి నియోజకవర్గం తన్నీరు నాగేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు వట్టెం మనోహర్ పూలమాలవేసి నివాళులర్పించి, అనంతరం భారీ ఎత్తున అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బూడిద నరసింహారావు, వైస్ చైర్మన్ ఫిరోజ్ ఖాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా వైకుంఠరావు, మాజీ పట్టణ పార్టీ అధ్యక్షులు చౌడవరపు జగదీష్, జిల్లా కార్యదర్శిలు మాతంగి నాగబాబు, వేముల మల్లేశ్వరరావు, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్స్, మన్నే అప్పారావు, పింగాలి నరసింహారెడ్డి, మోరే దుర్గ ప్రసాద్, వివిధ గ్రామ నాయకులు, కార్యకర్తలు, రంగా అభిమానులు పాల్గొన్నారు.

### వైసీపీ కార్యాలయంలో రంగాకు నివాళులు



**పామర్రు మేజర్ న్యూస్ :** వంగవీటి రంగా 36వ వర్ధంతి సందర్భంగా పామర్రులోని వైసీపీ కార్యాలయమునందు ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. పామర్రు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఆరేపల్లి శ్రీనివాసరావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రంగా అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### నందిగామలో...



**నందిగామ, మేజర్ న్యూస్ :** గాంధీ సెంటర్లో నందిగామ నియోజకవర్గ జనసైనికులు వంగవీటి మోహనరంగా36 వ వర్ధంతి సందర్భంగా రంగా విగ్రహానికి పూలమాలలు వేసి జనసైనికులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జన సైనికులు నందిగామ మున్సిపాలిటీ 20వ వార్డు కౌన్సిలర్ తాటి వెంకటకృష్ణ పూజారి రాజేష్ కామిశెట్టి వెంకటేశ్వరరావు వందేమాతరం అశోక్, రామిసెట్టి బుజ్జి, నరసింహారావు, పఠాన్ రజాక్, వద్దేల్లి సుధాకర్, వెంకటేశ్వరరావు, చిరంజీవి, లిఖిత్,రఫీ, చలపతి,తదితరులు పాల్గొని ఘన నివాళి అర్పించారు.

### పట్టణ శివారు అనాసాగరం 20వ వార్డులో..



పట్టణ శివారు అనాసాగరం 20వ వార్డులో వంగవీటి మోహన రంగా విగ్రహం వద్ద కూటమి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఒక వ్యక్తి వ్యవస్థగా మారి అణగారిన వర్గాల గొంతుకయ్యారు. వ్యవస్థలో చైతన్యం తెచ్చి తిరుగుబాటుకు బీజం వేశారు. అణగారిన వర్గాలకు అభయహస్తం ఇచ్చారు. నేనున్నా అంటూ భరోసా కల్పించారు. అందుకే అమరుడైనా ప్రజల హృదయాల్లో మాత్రం చిరస్థాయిగా నిలిచి, చెరగని ముద్ర వేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఏచూరి రాము, కాసర్ల లక్ష్మీనారాయణ, శ్రీనివాస చారి, మనబోతుల శ్రీరామ్, కాజా, అసిమ్ భాష పాల్గొన్నారు.



### వైసీపీ ఆధ్వర్యంలో వంగవీటి రంగా 36వ వర్ధంతి

పట్టణంలోని గాంధీ సెంటర్, అనాసాగరం లో ఉన్న వంగవీటి మోహనరంగా విగ్రహాలకు స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నందిగామ మాజీ శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మహమ్మద్ మస్తాన్, పాములపాటి రమేష్, కర్రి రవీంద్ర, కన్నీకంటి జీవరత్నం,పాకాలపాటి కిరణ్, జాఫర్,ఓర్సు జ్వాలా, మున్నా, వడ్డెలి శ్రీను,వేమా సురేష్,పారుపల్లి హరిబాబు, శివనాగు, మంద మరియమ్మ, బండారు గంగమ్మ, ముప్వల శ్రీను,కామల్,నరేష్, రవి సింగంశెట్టి మల్లి తదితరులు పాల్గొన్నారు.

### కృత్తివెన్ను ఎండపల్లి పంచాయతీలో..



**కృత్తివెన్ను, మేజర్ న్యూస్ :** వంగవీటి మోహన్ రంగ 36వ వర్ధంతిని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురువారం రంగా వర్ధంతి సందర్భంగా ఎండపల్లి పంచాయతీలో తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పిన్నింటి రత్తయ్య ఆధ్వర్యంలో కూటమి నాయకులు రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ నియోజకవర్గ నాయకుడు శ్రీనివాస్ కూటమి నాయకులు గ్రామస్తులు రంగా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

### మచిలీపట్నంలో..



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** పేదల కోసం నిత్యం తపిస్తూ.. వారి బతుకుల కోసం చేసే పోరాటంలో ప్రాణాలు తృణ ప్రాయంగా అర్పించిన నాయకుడు వంగవీటి మోహన రంగ అని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర కుమారుడు, యువ నేత కొల్లు పునీత్ అన్నారు. వంగవీటి మోహన రంగ వర్ధంతి సందర్భంగా మచిలీపట్నంలోని రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### చల్లపల్లి పడమరవీధిలో...



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** స్థానిక పడమరవీధిలోని వంగవీటి మోహనరంగా విగ్రహానికి వివిధ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు ఘన నివాళులు అర్పించారు. ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పోరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు ముఖ్య అతిథిగా పాల్గొని రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం జనసేన ఇన్చార్జి బండి రామకృష్ణ, పాగోలు సర్పంచ్ తోట శ్రీనివాసరావు, నేతలు యాసం చిట్టిబాబు, బచ్చు వెంకటనాథ్, రాజనాల మాణిక్యాలరావు, రావి చిట్టి, గుడివాక శివరావు, బొందలపాటి వీరబాబు, రావి రాజేశ్వ రరావు, పసుపులేటి రవికుమార్, శ్రీనివాసరావు, సుబ్బారావు, అడపా రవి, రాధా రంగా మిత్ర మండలి సభ్యులు, పడమర వీధి యువత పాల్గొన్నారు.






### కంచికచర్ల రాధా రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో..

**కంచికచర్ల డిసెంబర్ 26 మేజర్ న్యూస్ :** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి,పేదల పాలిట పెన్నిధి, అణగారిన వర్గాల నాయకుడు స్వర్గీయ వంగవీటి మోహన రంగా 36వ వర్ధంతి కంచికచర్ల రాధా రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక నెహ్రూ సెంటర్లో రంగా విగ్రహానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, ఉపసర్పంచ్ వేమా సురేష్ బాబు, మాజీ సొసైటీ చైర్పర్సన్ కాలువ పెద్దబాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాధా రంగా మిత్రమండలి అధ్యక్షుడు ఉప్పు స్వామి దేవి రెడ్డి విగ్నేశ్వర రావు, దాసరి రాజా,గ్రంధి ప్రసాద్, బచ్చు వెంకటేశ్వరరావు, చాపా సత్యనారాయణ,మన్నెం శ్రీనివాసరావు, జోన్నల శ్రీనివాసరావు, బికారి,మస్తాన్, తుపాకుల రవి, బడేటి మల్లి,పోన్నపల్లి శ్రీనివాసరావు, దేవిరెడ్డి శ్రీనివాసరావు 324, దాదె బుచ్చిబాబు,దేవిరెడ్డి లక్ష్మీ నారాయణ, మంగినేని బుడ్డియ్య, మంగినేని వెంకట్రామయ్య, శ్రీనివాస్,మండల శివ,ఆకుల రామారావు, ఆవుల రాంబాబు, రంగా అభిమానులు పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబంలో ఒక వ్యాపారవేత్త ఉండాలి

## - మెప్మా డైరెక్టర్ తేజ్ భరత్ - లాంఛనంగా ప్రారంభమైన సంజా ఉత్సవ్





**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ప్రతి కుటుంబంలో ఒక వ్యాపారవేత్త ఉండాలని నినాదంతో సంజా ఉత్సవాన్ని నిర్వహించాము అన్నారు మెప్మా డైరెక్టర్ తేజ్ భరత్. విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం మ్యారీస్ స్టెల్లా కాలేజ్ ఇండోర్ స్టేడియంలో సంజా ఉత్సవ్ - ఎస్ హెచ్ జి మేళ 2024 ను లాంఛనంగా మెప్మా డైరెక్టర్ తేజ భరత్ అడిషనల్ కమిషనర్ జనరల్ విజయవాడ నగరపాలక సంస్థ డాక్టర్ డి చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మెప్మా డైరెక్టర్ తేజ్ భరత్ మాట్లాడుతూ నేషనల్ అర్బన్ లాగ్లీ హుడ్ మిషన్ 2.0 లో భాగంగా, పేద మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు ప్రతి కుటుంబంలో ఒక వ్యాపార ఉండాలని ఉద్దేశంతో సంధ్య ఉత్సవ పేరుతో ఇటువంటి మేళ ఏర్పాటు చేశారని తెలిపారు. 28 లక్షల స్వయం సహాయక బృందాలు అందులో 11 లక్షల మంది జీవనోపాధి కార్యకలాపాలు చేస్తున్నారని, అందులో ఆరు లక్షల మంది వ్యాపారవేత్తలు ఉండగా, ఐదు లక్షల మంది ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. అక్కడ వచ్చిన వారందరికీ ప్రభుత్వ పథకాలైన స్వనిదధి, విశ్వకర్మ యోజన, సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ఇండివిజువల్, సెల్ఫ్ ఎంప్లాయ్మెంట్ గ్రూప్, ఎస్హెచ్జి బ్యాంక్ లింకేజ్, ప్రధానమంత్రి ముద్ర లోన్ల గురించి తెలిపారు. ప్రతి ఒక్కరూ నిరంతర ఆదాయం సంపాదించే విధంగా అడుగులు వేయాలని అన్నారు. ఈ సందర్భంగా విజయవాడ నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి చంద్రశేఖర్ మాట్లాడుతూ అర్బన్ కమ్యూనిటీ డెవలప్మెంట్ లో భాగంగా నేషనల్ లవ్లీ హుడ్ మిషన్ 2.0 స్కీం ద్వారా పేద మధ్యతరగతి వారికి ఆర్థిక అభివృద్ధి కల్పించాలని ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. డిసెంబర్ 26, 2024 నుండి డిసెంబర్ 30, 2024 వరకు జరిగే ఈ కార్యక్రమంలో స్వయం సహాయక బృందాలు 100కు పైగా స్టాల్స్ లలో వారు తయారుచేసిన ఉత్పత్తులను ప్రదర్శన, అమ్మకం చేస్తున్నారని, ఉదయం 9 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు అన్ని వయసుల వారికి ఆకర్షించే విధంగా కిడ్స్ ప్లే, ఫుడ్ కోర్ట్, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారని తెలిపారు. ఉచిత ప్రవేశమైన ఈ మేళాలో అందరూ పాల్గొని జయప్రదం చేయవలసిందిగా విన్నవించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఫ్లోర్ లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి, కార్పొరేటర్ దేవినేని అపర్ణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు సి డి) పి. వెంకటనారాయణ, టెక్నికల్ ఎక్స్పెస్ ఫణి కుమార్, సుజాత, తదితరులు పాల్గొన్నారు.





### జగన్ అసెంబ్లీకి రాకపోవడం

## ప్రజాస్వామ్యం మీద దాడి లాంటిదే...

**ముఖ్యమంత్రి చంద్రబాబును చూసే ధైర్యం లేక అసెంబ్లీకి రావడం లేదు**

**గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావ్**



**గన్నవరం, డిసెంబర్ 26, మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యలను ప్రస్తావించాల్సిన వేదిక అసెంబ్లీ అని, ముఖ్యమంత్రి చంద్రబాబును చూసే ధైర్యం లేక పులివెందుల ఎమ్మెల్యే జగన్ అసెంబ్లీకి రావడం లేదని గన్నవరం నియోజ కవర్గ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావ్ విమర్శించారు. గురువారం రామవరప్పాడులో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జగన్ ప్రజాదర్బార్ నిర్వహించడం హాస్యాస్పదమని ప్రజాదర్బార్ లో వచ్చిన ఫిర్యాదులను జగన్ సొంత నిధులతో పరిష్కరిస్తారా అని ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాలకు రాకుండానే మైక్ ఇవ్వడం లేదంటూ అసత్యాలు చెబుతున్నారని, జగన్ కు మైక్ ఇవ్వరేమోనన్న ఫోబియా పట్టుకుందని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ కి రాకపోవడం అంటే ప్రజాస్వామ్యాన్ని, శాసనసభను అవమానించడమే అన్నారు. 1994 లో కాంగ్రెస్ కు ప్రతిపక్ష హోదా లేనప్పటికీ అప్పటి ప్రజాప్రతినిధులు శాసనసభకు వచ్చారని గుర్తు చేశారు. శాసనమండలికి వైసీపీ సభ్యులు ఎందుకు వెళ్తున్నారని, రాజ్యసభ లో, లోక్ సభలో వైసీపీ కి ప్రధాన ప్రతిపక్ష హోదా లేనప్పటికీ అక్కడికి ఎందుకు వెళున్నారని యార్లగడ్డ నిలదీశారు. చంద్రబాబుకు ప్రతిపక్ష హోదా తీసివేయడానికీ అప్పటి ముఖ్యమంత్రిగా వున్నా జగన్ సర్వశక్తులు ఒడ్డారన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని చెప్పారు. జగన్ తీరుతో వారి పార్టీ సభ్యులు కూడా బాధపడుతున్నారని కొత్తగా ఎమ్మెల్యే గా గెలుపొందిన వారు శాసనసభను చూస్తామా లేదా అని మదనపడుతున్నారని వ్యాఖ్యానించారు. బూతులు తిట్టే వారికీ మంత్రి పదవులు ఇస్తే ప్రజలు తిరస్కరించారని, అందుకు ప్రజలను నిందిస్తారా అని మండిపడ్డారు. 1955 నుండి ఇప్పటివరకు తక్కువ అభివృద్ధి జరిగింది జగన్ ప్రభుత్వంలో కదా అన్నారు. భాష పై కూడా దాడి చేసిన ప్రభుత్వం అని విమర్శించారు. 11 మంది శాసనసభ్యులు ఉంటే ప్రతిపక్ష హోదా ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ప్రతిపక్ష హోదా ప్రజలే ఇవ్వలేదని యార్లగడ్డ వ్యాఖ్యానించారు.

### ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ



**నందిగామ, డిసెంబర్ 26, మేజర్ న్యూస్:** అనారోగ్య కారణంగా ప్రైవేటు వైద్యశాలలో వైద్యం చేయించుకుని జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్(తాతయ్య) సిఫారసు మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధికి బిల్లులతో దరఖాస్తు చేసుకొనుగా మండలంలోని కొణతమాత్మకూరు గ్రామానికి చెందిన షేక్ నాగుల్ బి తండ్రి మౌలాలి కి 21,000 షేక్ మహబూబ్ సుభాని కి 30,000 రామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దగ్గుపాటి పెద్ద నాగేశ్వరరావు కు 38,961 కొండూరు గ్రామానికి చెందిన దేవినేని కుమారి కి 1,62,000 మాగల్లు గ్రామానికి చెందిన చల్ల పల్లి పెద్దవీరయ్య కు 45,488 రూపాయల చెక్కులను మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి తోట నాగమల్లేశ్వర రావు(బుజ్జి) పంపిణీ చేశారు. గ్రామాల్లో ప్రజలు లబ్ధిదారులు మంచి ప్రభుత్వం వచ్చిందని గత ఐదేళ్లుగా ఏ సహాయం లేక ప్రజలను సహాయ స్థితిలో ఉన్నారని తమకు ఆర్థిక సహాయం చేసిన కూటమి ప్రభుత్వానికి ఎల్లవేళలా ఋణపడి ఉంటామని తెలియజేశారుఈ కార్యక్రమంలో జవ్వాజి భాస్కరరావు, మన్నేపల్లి వినయ్ కుమార్,కేసగాని వెంకటేశ్వర్లు(వెంకన్న), మంద రమేష్,కోరంపల్లి నాగేశ్వరరావు,సూరంపల్లి అప్పారావు,చెరుకుమల్లి శేషగిరిరావు తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

### మమ్మురంగా టీడీపీ సభ్యత్వం నమోదు



**ఏ కొండూరు, మేజర్ న్యూస్:** మండలంలోని అన్ని గ్రామాల్లో టిడిపి సభ్యత్వ నమోదు ముమ్మ రంగా కొనసాగుతుంది. విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేసినేని శివనాథ్( చిన్ని) తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గడ్డి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వం నమోదుముమ్మరంగా సాగుతుంది. మండలంలోని రామచంద్రపురం గ్రామంలో గురువారం కృష్ణారెడ్డి సభ్యత్వం నమోదు కార్యక్రమంలో పాల్గొని సభ్యత్వ నమోదు చేయించుకోవాలని అవ గాహన కల్పించారు. సభ్యత్వం తీసుకుంటే కలిగే లాభాల గూర్చి వివరించారు.

# పర్యాటక అభివృద్ధిలో కీలక భాగస్వాములు కావాలి



**ప్రత్యేక ప్యాకేజీ రూపకల్పనకు కృషి చేస్తున్నాం**

**హోటళ్ల యాజమానులతో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 26, మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లాను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసే బృహత్తర కార్నక్రమంలో హోటళ్ల యాజమానులు కీలక భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కోరారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ.. నగరంలోని వివిధ హోటళ్ల యజమానులతో సమావేశమయ్యారు. జిల్లాకు పెద్దఎత్తున పర్యాటకులను ఆకర్షించేలా పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేసి జిల్లాను పర్యాటక హబ్ గా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నామని.. ప్రత్యేక పర్యాటక ప్యాకేజీని అమలు చేసేలా ఆలోచన చేస్తున్నామని అన్నారు. జిల్లాలో కనక దుర్గమ్మ దేవాలయంతో పాటు భవానీ ద్వీపం, కొండపల్లి బొమ్మల తయారీ కేంద్రం, కొండపల్లి ఖిల్లా వంటి ప్రముఖ పర్యాటక కేంద్రాలున్నాయని.. జిల్లాలోని పర్యాటక కేంద్రాలలో మౌలిక వసతులను అభివృద్ధి చేసి మరింతమంది పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. ప్రత్యేక ప్యాకేజీతో ట్యాక్సీ, వాహన యజమానులతో పాటు ఆతిథ్య రంగ అభివృద్ధికీ అవకాశముంటుందన్నారు. పర్యాటక రంగ అభివృద్ధితో ఉపాధి అవకాశాల సృష్టి జరుగుతుందన్నారు. ప్యాకేజీ రూపకల్పనకు భాగస్వామ్య పక్షాలతో వరుసగా సమావేశాలు నిర్వహిస్తున్నామని.. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ వివరించారు. సమావేశంలో జిల్లా టూరిజం అధికారి ఎ.శిల్ప, ఏపీ హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధి ఆర్వీ స్వామి, వి.రాఘవేంద్ర,హోటల్ ఐలాపురం ప్రతినిధి రాజా, బిందు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

### ఫ్లెక్సీ బ్యానర్లు ముద్రించుటకు అనుమతి తప్పనిసరి

**కమిషనర్ రమణబాబు**



**నందిగామ, డిసెంబర్ 26, మేజర్ న్యూస్:** జనవరి మూడో తేదీ నుండి నుండి నందిగామ పట్టణములో ఫ్లెక్సీలు,, బ్యానర్లు ముద్రించుటకు పురపాలకసంఘము వారి అనుమతి తప్పనిసరి నందిగామ ప్రజలకు, అన్ని రాజకీయ పార్టీల వారికి, స్వచ్ఛంద సంస్థలు అందరికీ నందిగామ పురపాలక సంఘం వారి విజ్ఞప్తి చేస్తున్నట్లు కమిషనర్ రమణబాబు తెలిపారు."స్వచ్ఛ నందిగామ" కార్యక్రమములో భాగముగా ది.3.1.2025వ తేదీ నుండి నందిగామ పట్టణములో రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పెద్దకములు, అభివృద్ధి కార్యక్రమముల వివరములు, ఉపయోగకరమైె కార్యక్రమముల ఫ్లెక్సీలు తప్ప మిగిలిన వాటి అన్నింటికీ పురపాలక సంఘ వారి అనుమతులు తీసుకొన్న తరువాత మాత్రమే ముద్రించుకొనవలసినదిగా తెలియచేసుకొనుచున్నాముప్రస్తుతము పట్టణములో ఉన్నటువంటి బ్యానర్లు ది.2.1.2025వ తేదీ లోపు స్వచ్ఛందముగా తొలగించుకొనవలసినదిగా విజ్ఞప్తి చేస్తున్నాము. లేనియెడల ది.3.1.2025వ తేదీ ఉదయము నుండి పురపాలక సిబ్బందిచే అనుమతి లేని ఫ్లెక్సీలు, బ్యానర్లు అన్నింటినీ తొలగించబడును.కావున "స్వచ్ఛ నందిగామ" కార్యక్రమములో భాగముగా ప్రజలందరూ ఈ కార్యక్రమమునకు సహకరించవలసినదిగా పురపాలక సంఘం తరపున విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు.

### ఘనంగా కృష్ణా జిల్లా ఫెన్సింగ్ జట్ల ఎంపికలు



**నందిగామ, డిసెంబర్ 26, మేజర్ న్యూస్:** పొన్నవరం గ్రామంలోని ఏకత్వా పాఠశాలలో ఘనంగా కృష్ణాజిల్లా ఫెన్సింగ్ అండర్ 17 బాల బాలికల క్యారెట్ జట్ల ఎంపికలను గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించినట్లు కృష్ణా జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి నాగం సతీష్ తెలిపారు. ఈ ఎంపికలకు ఉమ్మడి కృష్ణా జిల్లా నలుమూల నుండి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ఇక్కడ ఎంపికైన బాల బాలికలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడ లక్ష ఇంటర్నేషనల్ స్కూల్లో డిసెంబర్ 28, 29 తేదీలలో జరగబోయే రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ ఎంపికలకు ముఖ్యఅతిథిగా ఏకత్వ పాఠశాల ఫౌండర్, డైరెక్టర్ అమరనేని మనోజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ ఇలాంటి రూరల్ ఏరియాలో కూడా ఫెన్సింగ్ లాంటి క్రీడలను నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా కృష్ణాజిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ సభ్యులు ధనియాల నాగరాజు, విజయ్ కుమార్ గోగులమూడి, ప్రధానోపాధ్యాయులు అడపా నాగ సూర్యవతి, ఏకత్వ పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ అమరనేని సింధూర పాల్గొన్నారు.



### నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే కుమార్ రాజా



**పామర్రు డిసెంబర్ 26 మేజర్ న్యూస్:** పామర్రు మండలం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మండపాక శంకర్ బాబు కుమారుని వివాహ వేడుకల్లో స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. గుడివాడలోని తాళ్లూరి కళ్యాణ మండపంలో గురువారం జరిగిన వివాహ వేడుకలలో పామర్రు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్ తో కలిసి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఘనంగా కమ్యూనిస్టు సీపీఐ 100 వసంతాల పండుగ



**ఘంటసాల, మేజర్ న్యూస్:** భారత కమ్యూనిస్టు పార్టీ( సిపిఐ) 100 వసంతాల ఘనంగా ఉత్సవాలు జరిపారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ 1925 డిసెంబర్ 26 న ఆవిర్భవించి 2025 డిసెంబర్ 26 నాటికి 100 సంవత్సరంలోకి అడుగు పెడుతున్నదని తెలిపారు. దేశంలో 100 సంవత్సరాల ఉద్యమ పార్టీగా సిపిఐ ఖ్యాతి పొందిందని స్వాతంత్ర్యం కొరకు జరిగిన పోరాటంలో ఆనాడే అనేకమందిప్రాణత్యాగాలు చేసిన వీర చరిత్ర గలది భారత కమ్యూనిస్టు పార్టీ అని తెలియజేశారు. దేశ స్వాతంత్ర్యం కొరకు ఫ్యూడల్ సంస్థానాల విముక్తి కొరకు తాడిత పీడత జనావళి కొరకు వేలాది మంది ప్రాణాలను కోల్పోయిన ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని చెప్పారు. మహోజ్వల చరిత్ర కలిగిన భారత్ ను కాపాడుకోవడంలో అహర్నిశలు కృషి చేస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీకి సంపూర్ణ మద్దతు ఇవ్వవలసిందిగా కోరినారు. శ్రీకాకుళం, గోగినేని పాలెం, ఘంటసాల, తదితర గ్రామాల్లో సిపిఐ జెండా ఆవిష్కరించి భారత కమ్యూనిస్టు పార్టీ వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు.

### మాజీ ఎంపీను సన్మానం చేసిన వైసీపీ నాయకులు

**ఏ.కొండూరు, మేజర్ న్యూస్:** ఎంపీ మోదుగుల వేణుగోపాల్ రెడ్డికు వైసీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. గుంటూరు జిల్లా మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్ రెడ్డి గుంటూరు నుంచి తిరువూరు వైపు వెళ్తుండగా మార్గ మధ్యలో ఖమ్మంపాడు గ్రామంలోని మెయిన్ సెంటర్లో ఎంపీను ఆపి వైసీపీ మండల యూత్ అధ్యక్షుడు కాలసాని చెన్నారావు వైఎస్ఆర్సిపి నాయకులు సోలా నరసింహారావు చిమట రామకృష్ణ శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెదగొల్ల జమలయ్య పలువురు పాల్గొన్నారు.

# సోలార్ స్మార్ట్ మీటర్ల కార్యాలయాన్ని ప్రారంభించిన పోలిట్ బ్యూరో సభ్యులు దశరధ జనార్ధన్



**వత్సవాయి, మేజర్ న్యూస్ :** మండలంలో మక్కపేట గ్రామంలో దీప్తి ఎలక్ట్రికల్ వర్క్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోలార్ స్మార్ట్ మీటర్ల కార్యాలయాన్ని పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ తొండపు దశరధ జనార్ధన్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సోలార్ మీటర్ వల్ల కరెంట్ ఆదా చేసుకోవడమే కాకుండా అనవసరమైన భారం ప్రజలపై ఉండదన్నారు.ఈ సోలార్ స్మార్ట్ మీటర్ వల్ల ఎస్ సి, ఎస్ టి లకు 200 యూనిట్లు లోపు ఉచిత కరెంట్ ఇస్తుందన్నారు.గత ప్రభుత్వం సామాన్యుడుపై అధిక భారం మోపిందన్నారు.కరెంట్ బిల్లు లు కూడా కట్టలేక పేద ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. గత ప్రభుత్వం ఎస్సీ ఎస్టీలకు 200 లోపు ఉచిత కరెంటు ఇస్తామని హామీ ఇచ్చి మీటర్ రీడింగు సమయం దాటిన తర్వాత రీడింగ్ తీసి ప్రజలపై అధిక భారం మోపిందన్నారు. మన ప్రభుత్వంలో ప్రజలపై అధిక ఉండకూడదని మన ప్రభుత్వం ఆదాని గ్రూపు తో మాట్లాడి సామాన్యుడికి అందుబాటులో ఉండే విధంగా సోలార్ స్మార్ట్ మీటర్లు పెట్టి ఒకటో వ తారీఖు నుండి 30 వ తారీకు వరకు రీడింగ్ తీసుకుంటే 200 దాటితేనే ఎస్సీ ఎస్టీలకు బిల్లు కట్టే విధంగా ఆదాని గ్రూపుతో మన ప్రభుత్వం ఒప్పంద కుదుర్చుకున్నది అని అన్నారు. ముందు కమర్షియల్ వారికి సోలార్ స్మార్ట్ మీటర్లు అమర్చిన అనంతరం గృహాలకు ఈ సోలార్ స్మార్ట్ మీటర్లు బిగిస్తారని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకొని కరెంటును ఆదా చేయాలనే ఆయన అన్నారు.అనంతరం కరెంటు ఏడి జె. శ్రీనివాస్ మాట్లాడుతూ సబ్సిడీపై మూడు కిలోల వాట్స్ వరకు ప్రభుత్వం ఇస్తుందని అన్నారు. లక్ష యాభై వేల నుండి రెండు లక్షలు వరకు ఖర్చు వస్తుందని అది ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు.సబ్సిడీ కింద 70000 వేలు,బ్యాంకు ఋణం 130000 వేలు ప్రభుత్వమే ఇప్పిస్తుందన్నారు.నెలసరి వాయిదాలలో మనం బ్యాంకు కు చెల్లించవచ్చన్నారు.మొబైల్ నెంబర్, బ్యాంక్ అకౌంట్, మీటర్ నెంబర్ మా కార్యాలయం వారికి ఇవ్వాల్సి ఉంటుందని అన్నారు. సోలార్ కరెంట్ మనం వాడుకున్న అంతవరకు సెల్ లో రికార్డు అవుతుంది అని అన్నారు. రైతులకు చేలకు సోలార్ కరెంట్ కావాలనుకుంటే ఒక కిలోమీటర్ లోపు ఉన్న చేలకు ఎకరానికి 30 వేల రూపాయల చొప్పున లీజు ప్రభుత్వమే భరిస్తుందని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలందరూ వినియోగించు కోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కట్టా వెంకట నరసింహారావు, మక్కపేట గ్రామ సర్పంచ్ మల్లెల శివప్రసాద్, కరెంటు ఏఈ పి రవికుమార్, ఆదాని గ్రూప్ జేఈ పూర్ణ, దీప్తి ఎలక్ట్రికల్ వర్క్స్ ప్రొప్రైటర్ సందీప్,మాజీ ఎంపీటీసీ తాళ్ళూరి జీవమ్మ వెంకటరత్నం,అయినాల సాంబయ్య,దారావత్ రామారావు, తమ్మిశెట్టి శ్రీను, యంద్రాతి దావీదు,డేవిడ్,మదార్, గుడేటి వెంకటనారాయణ, కత్తి ప్రభాకర్, యంద్రాతి వీరబాబు,దోరేపల్లి వెంకటరత్నం,లంజపల్లి ప్రకాష్, కరెంట్ లైన్ మెన్ లు,హెల్పర్స్ తదితరులు పాల్గొన్నారు.

# పతాక స్వర్ణోత్సవాలకు సర్వం సిద్ధం



## జిల్లా కలెక్టర్ బాలాజీ

**మొవ్వ (డిసెంబర్ 26) మేజర్ న్యూస్:** నాట్య క్షేత్రం కూచిపూడి లో ఈనెల 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్న కూచిపూడి పతాక స్వర్ణోత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్లు కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఒక ప్రకటన తెలిపారు. కూచిపూడి హెరిటేజ్ ఆర్ట్స్ సొసైటీ, కేంద్ర సాంస్కృతిక శాఖ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యా లయం, రాష్ట్ర క్రియేటివ్ అండ్ కల్చర్ కమిషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న పతాక స్వర్ణోత్సవాల సందర్భంగా ప్రదర్శించనున్న నాట్యం శాలు కళాభిమానులకు కనువిందులు కానున్నాయన్నారు. మూడు రోజులు పాటు నిర్వహించనున్న స్వర్ణోత్సవాలలో నాట్యంశాల ప్రవచించేందుకు ప్రదర్శించేందుకు రాష్ట్రాలు పలు రాష్ట్రాలతో పాటు రష్యా అమెరికా కెనడా జపాన్ జర్మనీ వంటి దేశాల కళాకారుల నాట్య ప్రదర్శనలతో సిద్ధేంద్రుడు నీరాజనాలు అ అందుకోనున్నారన్నారు. ఈ స్వర్ణోత్సవాలను జిల్లా ఇన్చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ పలువురు రాష్ట్ర మంత్రులు ప్రారంభించనున్నారని అన్నారు. స్వర్ణోత్సవాల కన్వీనర్ డాక్టర్ వేదాంతం వెంకట నాగచలపతిరావు పర్యవేక్షణలో మొదటి రోజైన 27వ తేదీన 50 అడుగుల పతాక స్తూపం ఆవిష్కరణతో పాటు నగర సంకీర్తన సదస్సులు నాట్య ప్రదర్శనలు ఉంటా యని తెలిపారు. అలాగే 28వ తేదీన నగర సంకీర్తన నాట్య శిక్షణ శిబిరం అతిధుల ఉపన్యాసాలు నాట్య ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. అలాగే ముగింపు రోజైనా 29వ తేదీన రెండువేల మంది కళాకారులతో మహా బృందా నాట్ అంశాలు నాట్యంశాలు ఉండాలని తెలిపారు.

ప్రదర్శించనున్నా రని తెలిపారు. మూడు రోజులు పాటు జరిగే ఈ స్వర్ణోత్సవాలకు విదేశాల నుంచి వచ్చే కళాకారులకు అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కూచిపూడి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అధికారులకు సూచించారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర ఉపసభాపతి కనుమూరి రఘురామ కృష్ణంరాజు ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొననున్నట్లు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు.

# విజయవంతంగా ముగిసిన భవాని దీక్ష విరమణలు

## భవాని దీక్ష విరమణ ఏర్పాట్లలో వీఎంసీ సిబ్బందిని అభినందించిన కమిషనర్







**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా ఆదేశాల మేరకు భవాని దీక్షల విరమణ కొరకు విజయవాడ నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన ఏర్పాట్లను వివిఎంసి సిబ్బంది సక్రమంగా చేస్తూ పనులు నిర్విరామంగా నిర్వహిస్తూ భవాని దీక్ష విరమణలు విజయవంతం చేసినందుకు గురువారం నాడు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర వి ఎం సి సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పోలీస్, ఎండోమెంట్స్, రెవెన్యూ, హెల్త్, ఫైర్, ఏపీసీపీడీసీఎల్, ఐసిడిఎస్ తదితర వివిధ శాఖల సౌజన్యంతో జరిగిన భవాని దీక్ష విరమణలు విజయవంతంగా జరిగినవని తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ వారి డ్రోన్లతో ప్రత్యేకంగా పారిశుధ్య నిర్వాహణ చేశారని లైవ్ స్ట్రీమింగ్ ద్వారా ఎప్పటికప్పుడు కంట్రోల్ రూమ్ నుండి అధికారులు పర్యవేక్షించి పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం గమనించిన అధికారులు వెంటనే సిబ్బందిని వైర్లెస్ సెట్ లో అప్రమత్తం చేసి పారిశుధ్య నిర్వహణ లో ఎటువంటి లోపం లేకుండా చేశారని తెలిపారు. ఇప్పటివరకు దాదాపు పది లక్షల వాటర్ బాటిల్ లను 6,50,000 వాటర్ ప్యాకెట్లను భవాని భక్తులకు పంపిణీ చేశారని, 200 తాత్కాలిక మరుగుదొడ్లను 15 ప్రాంతాలలో అమర్చి నిత్యం పరిశుభ్రపరుస్తూ, వాడుక నీటిలోనూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో కూడా కమాండ్ కంట్రోల్ రూమ్ లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ సిబ్బంది ఎప్పటికప్పుడు పాయింట్ లలో గల నివేదికను తీసుకుంటూ నిత్యం టాంకర్లతో డ్రమ్ములను నింపి, 300 ఇంజనీరింగ్ సిబ్బంది విధుల్లో నిమగ్నమై నిత్యం భవాని భక్తులకు త్రాగునీటి సరఫరా, తాత్కాలిక మరుగుదొడ్ల నిర్వహణలో ఎటువంటి అంతరాయం లేకుండా 24 గంటలు పని చేశారని తెలిపారు. పారిశుధ్య నిర్వహణ కోసం వచ్చిన 1400 పారిశుధ్య కార్మికులు నిత్యం పనిచేస్తూ అహర్నిశలు శ్రమించారని, వారిని 104 సిబ్బంది పర్యవేక్షించారని, కన్వేయర్ బెల్ట్ ద్వారా ఎప్పటికప్పుడు భవానీ దుస్తులను తీసివేయటమే కాకుండా వాటిని ఎక్సల్ ప్లాంట్ కు తరలించాలని. భవాని దీక్ష విరమణ వస్త్రాలు వ్యర్థాలను సేకరించాలని, పొడి చెత్త 750 టన్నుల వ్యర్థాలను సేకరించారని, వాటిని ఎప్పటికప్పుడు ఎక్సెల్ ప్లాంట్ కి తరలించాలని తెలిపారు. భవాని భక్తుల కోసం ఉచితంగా ఆరు సామాన్లు, చెప్పులు భద్రపరచు క్లోక్ రూములను ఏర్పాటు చేయడమే కాకుండా భక్తులకు తెలియపరచుటకు పబ్లిక్ అడ్రెస్సింగ్ సిస్టం మైకుల ద్వారా ఉచిత క్లోక్ రూమ్లు ఎక్కడెక్కడ ఉన్నాయి వాటికి ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని ప్రతి అరగంటకి ప్రచారం చేసి భక్తులకు తెలియపరిచారని తెలిపారు. భవాని దీక్ష విరమణ కోసం వచ్చే భక్తులకు దోమల ద్వారా జంతువుల ద్వారా ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకునేందుకు వెటర్నరీ, మలేరియా విభాగం నిరంతరం పర్యవేక్షిస్తూ ఎమ్ ఎల్ ఆయిల్ స్ప్రే, ఫాగింగ్ ఎప్పటికప్పుడు చేసుకుంటూ భవాని భక్తులు ప్రశాంతంగా వారి దీక్ష విరమణ చేసుకునేందుకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. వాస్తవంగా భవానీ దీక్ష విరమణలు డిసెంబర్ 21 నుండి 25 వరకు ఉన్నప్పటికీ ఒకరోజు ముందు ఒకరోజు తర్వాత కూడా నగరపాలక సంస్థ విధులు నిర్వహిస్తూ దీక్ష విరమణలు విజయవంతంగా చేసినందుకు విజయవాడ నగరపాలక సిబ్బంది అందర్నీ కమిషనర్ అభినందించారు.







## రీ సర్వే గురించి రైతులకు అవగాహన ర్యాలీ

**రెడ్డిగూడెం, డిసెంబర్ 26, మేజర్ న్యూస్:** మండల పరిధిలో గల ముచ్చనపల్లి, శ్రీరామపురం గ్రామములో రీ. సర్వే గురించి రైతులకు అవగాహన ర్యాలీ గురువారం జరిగిందని తహసిల్దార్ జె సుశీల దేవి తెలిపారు. ఈ సందర్భంగా తహసిల్దార్ రైతులకు రీ సర్వే గురించి అవగాహన కలగజేశారు. అనంతరం రీ సర్వే ర్యాలీని రైతులతో కలిసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ గంధం పుల్లయ్య, సర్వేయర్లు శివశంకర్, మురళి, గ్రామ సర్వేయర్లు, సర్పంచ్ లు అట్లూరి శ్రీనివాసరావు,దేవళ్ళ జమలయ్య, తెలుగుదేశం నాయకులు నాదెండ్ల చెన్నకేశవరావు (కేసిబాబు), బెల్లంకొండ రాజబాబు, గ్రామ రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వాడ వాడలా ఎర్రజెండా రెపరెప



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంతాల వేడుక నియోజకవర్గ పరిధిలో అన్ని గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. చల్లపల్లి, వక్కలగడ్డ, నడకుదురు, నిమ్మగడ్డ, వెలివోలు, శ్రీకాకుళం, చినకళ్లేపల్లి మోపిదేవి, గ్రామాలలో పార్టీ గ్రామ కార్యదర్శులు ఎర్రజెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాల ఉద్యమ చరిత్రలో పీడిత ప్రజల పక్షాన అనేక ఉద్యమాలు చేసిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ,గుత్తికొండ రామారావు, నక్క శ్రీనివాసరావు, మల్లు పెద్ది బోసు, మల్లిపెద్ది రాజా, హనుమానుల రాణి కుమారి, కొల్లూరు శ్రీధర్ ఆర్ఎంపి శేషు, దాసరి గోపాలకృష్ణ,మల్లుపెద్ది జగన్ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యలక్ష్మి మరణం ఎంపీపీ రజనీకి తీరని లోటు



**ఘంటసాల, మేజర్ న్యూస్:** ఘంటసాల ఎంపీపీ వేమూరి రజినీ కుమారి అత్త, వైఎస్సార్సీపీ నేత, కి.శే. షావు కారు ప్రసాద్ మాతృమూర్తి వేమూరి రాజ్యలక్ష్మి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీ అవనిగడ్డ నియోజకవర్గ కన్వీనర్ సింహాద్రి రమేష్ బాబు వైఎస్సార్సీపీ మండల అధ్యక్షులు వేమూరి వెంకట్రావు, పిఏసీఎస్ మాజీ చైర్పర్సన్ వేమూరి రత్నశేఖర్‌లతో కలసి ఎంపీపీ వేమూరి రజినీ కుమారిని, ఎంపీపీ కుమారులు ప్రవీణ్, నవీన్, కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం రాజ్య లక్ష్మి చిత్రపటానికి రమేష్ బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో గొర్రెపాటి వెంకట్రావు, గొర్రెపాటి జగన్మోహనరావు, మధు సూదనరావు, గొర్రెపాటి గోపాల కృష్ణ, దేవినేని విజయ్ కుమార్, ఆకురాతి భాస్కరరావు, రుత్విక్, తదితరులు ఉన్నారు.

# చెరువు సెంటర్‌లో వంగవీటి రంగా 36వ వర్ధంతి





## రంగా విగ్రహానికి పూల మాల నివాళులర్పించిన వైసీపీ సీనియర్ నేత పోతిన మహేష్

## వంగవీటి రాధా పై సంచలన వ్యాఖ్యలు చేసిన వైసిపి సీనియర్ నేత పోతిన మహేష్

**విజయవాడ, మేజర్ న్యూస్ :** స్థానిక విద్యాధరపురంలోని చెరువు సెంటర్ లో దివంగత నేత వంగవీటి రంగా 36 వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన వైసీపీ సీనియర్ నేత పోతిన మహేష్ రంగా విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. పేద మహిళలు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు స్ఫూర్తి, నమ్మిన పేద ప్రజల జీవితాల కోసం నిలబడ్డ గొప్ప వ్యక్తి వంగవీటి రంగా అని, వంగవీటి రంగా తమకు ఎప్పటికీ స్ఫూర్తి అని, ఆశయాల కోసం ఎలా నిలబడాలో తెలిపిన వ్యక్తి రంగా అని, వంగవీటి రంగా అందరి వాడని, కాని సమాజంలో ఒక వర్గం నేత అని చిత్రీకరించడం వెనుక రాజకీయ కుట్ర ఉందన్నారు. రంగా ఉద్యమ వారసులుగా తాము అనేక పోరాటాలు చేశామన్నారు. అనంతరం రంగా తనయుడు సీనియర్ నాయకులు వంగవీటి రాధా పై సంచలన వ్యాఖ్యలు చేశారు. వంగవీటి రంగా ఆశయాలను తీసుకెళ్లాల్సిన వ్యక్తులు కుటుంబ వారసులుగానే మిగిలిపోతున్నారని, కాపు రిజర్వేషన్ల పైన రంగా కుమారుడు రాధా ఒక్క మాట మాట్లాడలేదన్నారు. విగ్రహావిష్కరణలు చేస్తూ తానే వారసుడని రాధా చెప్పుకుంటున్నారని, కాని రంగా ఆశయాల కోసం ఎక్కడా నిలబడని వ్యక్తి రాధా అన్నారు. రంగా కొడుకు రాధా ఆలోచన అర్థం కావడం లేదని, కాపు సామాజిక వర్గ నేతలను అణగదొక్కుతున్నా వంగవీటి రాధా ఎప్పుడు బయటకు రాలేదని, అయినా రాధాను అన్ని వర్గాలు అభిమానిస్తూనే ఉన్నాయన్నారు. ప్రజా సమస్యలపై, కాపు సామాజిక వర్గ సమస్యలపై రాధా మాట్లాడకపోవడం తనకు బాధేస్తుందన్నారు. ఎన్నికల్లో మాత్రమే రాధా బయటకు వస్తున్నారని, మిగతా అంశాల్లో బయటకు రాకపోవడం రంగా వారసులమైన తమలాంటి వాళ్లకు బాధని కలిగిస్తుందన్నారు. రంగా పేరు జిల్లాకు పెట్టాలని రాధా ఎక్కడా ఎందుకు మాట్లాడడం లేదని ఆయన ప్రశ్నిచారు. వైట్ కాలర్ నేరస్తులు, పెత్తందారుల కు రాధా మేలు చేసినవి అనేకం ఉన్నాయని, రాధా పదవి గురించి మాట్లాడడం కాదు... రంగా ఆశయాల సాధన కోసం నడుం బిగించాలని, అధికారంలో ఉన్నప్పుడైనా మాట్లాడకుంటే ఎలా అని రాధాను విమర్శించారు. తమకు పదవుల మీద వ్యామోహం లేదని... సీటు రాకపోయినా పోరాటం చేస్తున్నామన్నారు. బీసీ వర్గాల భవిష్యత్తును కాలరాసే వ్యక్తులతో రాధా చేతులు కలపడం దురద్రుష్టకరమన్నారు.



## రెవిన్యూ సదస్సులను ప్రతి ఒక్కరు వినియోగించుకోండి



**పామర్రు, మేజర్ న్యూస్ :** గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రతి ఒక్కరు సద్వినియోగపరచుకుని వారి సమస్యలను పరిష్కరించుకోవాలని పమిడిముక్కల తహసిల్దార్ కె.నవీన్ కుమార్ విజ్ఞప్తి చేశారు. గురువారం పమిడిముక్కల మండలం ఐనంపూడి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం నిర్వహిస్తున్న ఈసదస్సులలో రైతుల భూములకు సంబంధించిన ప్రతి సమస్యను 45 రోజుల్లోగా ఉచితంగా పరిష్కరింపచేసుకోవాలని కోరారు. గ్రామ సర్పంచ్ ఏనుగ బేబి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కొడమంచిలి మహేష్, మండల సర్వేయర్, గ్రామ రెవెన్యూ అధికారి,గ్రామ సర్వేయర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలకు సంబంధించి పది అర్జీలు అందినట్లు తహసిల్దార్ నవీన్ కుమార్ తెలిపారు.

### మరింత అనుభూతిని మిగిల్చేలా..

# సామాజిక న్యాయ మహాశిల్ప సందర్శన

## పటిష్ట ప్రణాళికతో ప్రతిపాదనల రూపకల్పనకు కసరత్తు

## స్టీరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, మేజర్ న్యూస్ :** విజయవాడలోని 125 అడుగుల డా. బీఆర్ అంబేద్కర్ సామాజిక న్యాయ మహాశిల్ప సందర్శనకు వచ్చేవారికి మరింత మధురానుభూతి మిగిల్చేలా ఏర్పాట్లు చేయడం జరుగుతుందని.. ఇందుకు సంబంధించి పటిష్ట ప్రణాళికతో ప్రతిపాదనల రూపకల్పనకు కసరత్తు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. గురువారం డా. బీఆర్ అంబేద్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం, స్మృతివనానికి సంబంధించి కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న సందర్శకులు, వాహనాల పార్కింగ్ ప్రాంత విస్తరణ, ఫౌంటెయిన్లు, ఆర్వో ప్లాంట్, చిల్డ్రన్ ప్లే ఏరియా తదితరాలతో పాటు సుస్థిర నిర్వహణ పరంగా భవిష్యత్తులో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ డా. బీఆర్ అంబేద్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం, మ్యూజికల్ ఫౌంటెయిన్, కుడ్య చిత్రాలు, అంబేద్ధర్ చైత్య ఎక్స్‌పీరియన్స్ సెంటర్ తదితరాల సందర్శనకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని.. ఇందుకు సమన్వయ శాఖల అధికారులు కూడా ప్రతిపాదనలు రూపొందించి సమర్పించాలని ఆదేశించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు తదితరాలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. అభివృద్ధి చేసిన హరిత ప్రాంత అందం చెక్కుచెదరకుండా చూడాలన్నారు. సాధారణ రోజులతో పాటు సెలవు రోజుల్లో రద్దీని దృష్టిలో ఉంచుకొని వాహనాల పార్కింగ్ విస్వరణపైనా దృష్టిసారించాలన్నారు. డాల్బీ ఆటమ్స్ విహారా మినీ థియేటర్‌ను అందుబాటులోకి తేవడం, ప్రదర్శనలు, ఫుడ్ కోర్టు, వైజ్ఞానిక వినోద కార్యక్రమాల నిర్వహణ తదితరాలపైనా సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, విజయవాడ ఆర్‌డీవో కె.చైతన్య, జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి శిరోమణి, ఏపీఐఐసీ జెడ్ఎం కె.బాబ్జీ, కేపీసీ ప్రాజెక్ట్ లిమిటెడ్ ప్రతినిధి వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.



## పేద మహిళలకు చీరలు, పండ్లు పంపిణీ

### 18వ డివిజన్‌లో మోహన రంగా 36వ వర్ధంతి

**కృష్ణలంక, మేజర్ న్యూస్ :** విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని 18వ డివిజన్‌లో గురువారం స్వర్గీయ వంగవీటి మోహన రంగా 36వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా రంగా అభిమాని, వంగవీటి రాధా ప్రధాన అనుచరుడు గోగుల రమేష్ ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 18వ డివిజన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వేముల దుర్గారావు, ఎస్ కే జానీ, పగడాల వెంకటేశ్వర్ రెడ్డి, బలగాని శ్రీను, వేల్పుల శౌరి, అంబటి కాశి, సవలం అశోక్, కాళీ, మర్రి వెంకటరమణ, దేవల శ్రీను, గంద్ర వెంకటేశ్వర్లు, వెజర్ల శ్రీను, వేల్పుల విజయ్, పప్పుల బాబు, చింతకుంట్ల ఏడు కొండలు,దుర్గమ్మ, వి.దుర్గ, ఎర్రమ్మ, డి.రమణ, మరియమ్మ తదితరులు మహిలు పాల్గొన్నారు.

## నేటి అనారోగ్యాలకు మనమే కారణం




**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** నేటి అనారోగ్యాలకు మనమే కారణమని మన జీవన విధానం, తీసుకునే ఆహారం, అతిగా మందులు వాడటమే దీర్ఘ వ్యాధులకు కారణమైందని డాక్టర్ ఆర్ మురళీకృష్ణ చెప్పారు.గురువారం స్థానిక ఎస్ వి ఎల్ క్రాంతి కళాశాల లో ఆరోగ్య భారతి కృష్ణా జిల్లా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్యం పై అవగాహన కలిగించారు. ఆరోగ్య భారతి కృష్ణా జిల్లా శాఖ అధ్యక్షులు గుడిసేవ విష్ణు ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అనారోగ్య కారణాల గురించి వివరించారు. మన జీవన విధానంలో తీసుకునే ఆహారం విధానం ప్రతి చిన్న బాధకు అతిగా మందులు వాడటమే దీర్ఘవ్యాధులకు కారణం అవుతుందని శారీరక ఆరోగ్యం కొరకు శారీరక వ్యాయామం చేయాలని అన్నారు సానుకూలత ఆలోచనలతో జీవించడం ముఖ్యం అని ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ప్రతి కుటుంబం. ప్రతి గ్రామంఆరోగ్యం గా ఆరోగ్యంతో దేశమంతా ఆరోగ్యంగా ఉండాలని ఆరోగ్య భారతి తెలియజేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏ వి ఎల్ నారాయణ, గుడి సేవ కామేశ్వరి, జల్లూరి రమాకుమారి, వంగర శేషగిరిరావు, అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## డాక్టర్ మోర్ల శ్రీనివాసరావుకి భారత్ సేవా సింహం నేషనల్ అవార్డుకు ఎంపిక



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** పిట్టలవాని పాలెం శాఖ గ్రంధాల అధికారి డాక్టర్ మోర్ల శ్రీనివాసరావుకి ఆయన చేసిన సేవలు గాను అంతర్జాతీయ మనం ఫౌండేషన్ వారు భారత్ సేవా సింహం నేషనల్ అవార్డు 2024కు ఎంపిక చేయటమైంది. ఈ అవార్డు ఈనెల 28వ తారీఖున హైదరాబాదులోని తెలంగాణ సరస్వతి భవన్ బొగ్గులకుంటలో అందజేయడం జరుగుతుందని మనం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె చక్రవర్తి ఒక ప్రకటనలో తెలియజేశారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999